
సాక్షి బాపట్ల

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,965 క్యూసెక్కులు వదిలారు.



'బెదురులంక' టీమ్ సందడి

పాత గుంటూరు: హీరో కార్తికేయ నటించిన బెదురులంక 2012 చిత్ర యూనిట్ సోమవారం గుంటూరు నాజ్ థియేటర్‌లో సందడి చేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 522.20 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

8న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 8న జరగనుంది. గతనెల 19న గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల వల్ల వాయిదా పడిన సమావేశాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన సెప్టెంబర్ 8న మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. అలాగే గతంలో వాయిదా పడిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను సెప్టెంబర్ 8న ఉదయం 10 గంటలకు గుంటూరులోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించేందుకు సీఈఓ జె.మోహన్‌రావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఏడుస్థాయీ సంఘాలు జెడ్పీలో భేటీ కానున్నాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వ్యవసాయంపై 3వ స్థాయి సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘానికి తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షత వహించనున్నారు.

వాయిదా పడిన ఎస్‌ఐ అభ్యర్థుల పరీక్ష వచ్చేనెల 19న

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం నిర్వహించాల్సిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను వర్షం కారణంగా ఒక్క రోజు వాయిదా వేసినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న నిర్వహించాల్సిన పరీక్ష సెప్టెంబర్ 19న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గమనించాలని కోరారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.3,000, గరిష్ఠ ధర రూ.5,000, మోడల్ ధర రూ.3,800 వరకు పలికింది.

ఆటాడుకుందాం రా..



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు(ఫైల్)

ఉద్యోగుల క్రీడా సంబరం

- 19 క్రీడాంశాల్లో పోటీలు
- నేడు, రేపు జిల్లా స్థాయిలో పేర్ల నమోదు
- సెప్టెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపికలు
- విజయవాడ కేంద్రంగా క్రీడా పోటీలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: 'నేనింకా బాల్యంగ్రౌండ్‌లో.. బనీనూ నిక్కర్తో ఫుట్‌బాల్ ఆడుకుంటుండగా.. యవ్వన సంధ్యలో కలలు సౌధం ఉద్యోగంలో చేరిపోయినా.. ఆటలంటే నాకిష్టం..' అని ఓ కవి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. స్తబ్ధతగా ఉన్న ఉద్యోగుల్లో ఉత్సాహం నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉద్యోగులు ఆటల పోటీల్లో పాల్గొంటే శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసంతో ఉంటారనేది ప్రభుత్వ ఉద్దేశం. వయసుతో నిమిత్తం లేకుండా క్రీడలపై ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఆటల పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. ఇందు కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ సివిల్ సరీ్వసు టోర్నమెంట్ పేరుతో ఉద్యోగులకు క్రీడలు నిర్వహిస్తోంది. జిల్లా నుంచి జాతీయస్థాయి వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు.

క్రీడా పోటీలు ఇలా.....

ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రభుత్వం 19 రకాల క్రీడలు ఎంపిక చేసింది. ఎంపిక చేసిన క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. అథ్లెటిక్, బ్యాడ్మింటన్, చెస్, హాకీ, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, రెజ్లింగ్, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కోకో, వెయిట్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డాన్స్, వాలీబాల్, యోగా, శాట్‌ప్లే బెస్ట్‌ఫిజిక్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు.



పేర్ల నమోదుకు బాపట్ల క్రీడా వికాస కేంద్రం సిద్ధం

జిల్లాస్థాయిలో ఎంపికలు..

ఈ నెల 29, 30 తేదీల్లో క్రీడలపై ఆసక్తి ఉన్న ఉద్యోగులను గుర్తించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాకారుల నమోదు ప్రక్రియ బాధ్యత చేపట్టింది. పైన కనబరిచిన 19 రకాల క్రీడల్లో ఆసక్తి ఉన్న స్త్రీ, పురుషులు జిల్లా కేంద్రంలోని బాపట్ల క్రీడా వికాస కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలి. ఇక్కడ పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఏదైనా ఒక క్రీడకు సంబంధించి జిల్లాలో పూర్తి స్థాయి జట్టుకు తగినంత మంది రానిపక్షంలో వచ్చిన మేరకు క్రీడాకారులను ఎంపిక చేసి విజయవాడ పంపుతారు. జట్టుకు మించి క్రీడాకారులు వచ్చిన పక్షంలో ఇక్కడే పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా జట్టును ఇక్కడే ఎంపిక చేసి పంపుతారు.

సెప్టెంబర్ 4 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు...

జిల్లా స్థాయిలో ఎంపిక ప్రక్రియ పూర్తి అయిన తరువాత సెప్టెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. అక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ జట్లకు ఎంపిక చేయనున్నారు.

ఉద్యోగుల కోసం క్రీడా పోటీలు



ప్రభుత్వం ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. 19 రకాల క్రీడా అంశాలలో పోటీలు నిర్వహించనున్నాం. జిల్లా స్థాయిలో రెండురోజులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఆ తరువాత రాష్ట్ర స్థాయి ఎంపికలు జరుగుతాయి. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న ఉద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకొని క్రీడల్లో పాల్గొనాలి. జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జాతీయ జట్టుకు ఎంపిక చేస్తారు.

– రంజిత్‌బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

ప్రభుత్వ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. 19 రకాల పోటీలకు సంబంధించి ఎంపికలు జరగనున్నాయి. ఈ నెల 29, 30 తేదీల్లో ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా క్రీడావికాస కేంద్రం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి. ఇక్కడ సెలక్షన్స్ అయిన తరువాత సెప్టెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు విజయవాడలో రాష్ట్ర స్థాయిలో క్రీడాపోటీలు జరుగుతాయి.

– కె.పాల్‌కుమార్, చీఫ్‌కోచ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ



నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే కోన

ఉజ్వల భవిష్యత్‌కు 'దీవెన'

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద నగదు పంపిణీ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా నగరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని జిల్లాలో వీక్షించేలా అధికారులు ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. జిల్లాలోని విద్యార్థులకు జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా, ఏపీ మండలిలో చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి చేతుల మీదుగా స్థానిక స్పందన సమావేశ మందిరంలో నమూనా చెక్కు పంపిణీ చేశారు.

ఉన్నత లక్ష్యాలతో..

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. జిల్లాలో 28, 484 మంది విద్యార్థులకు తల్లుల ఖాతాలకు రూ.23.39 కోట్లు ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు లబ్ధిపొందారని వివరించారు. ఇంజినీరింగ్ వ్యయం తల్లిదండ్రులపై పడకుండా ఉండేందుకు ప్రభుత్వమే జగనన్న విద్యా దీవెన పథకాన్ని సమర్థంగా అమలు చేస్తోందని వెల్లడించారు. ఇష్టంగా చదివి, ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగాల డిమాండ్ తెలుసుకొని వాటివైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిణి జె.రాజదెబోరా, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కల్పన పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై చర్యలు తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ శ్రీధర్

బాపట్ల: స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సిహెచ్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశం హాల్‌లో స్పందన సోమవారం నిర్వహించారు. జేసీ శ్రీధర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందన అర్జీలు, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ జేడీలు అబ్దుల్ సత్తార్, హనుమంతరావు, సురేష్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, డీఎస్ఓ విల్లేమ్స్, డీఎం లక్ష్మి పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

ఉద్యోగం పేరుతో రూ.30 లక్షలు కాజేశారు

- చెరువుజమ్ములపాలెం బాధితుల ఫిర్యాదు
- స్పందనలో భారీగా అర్జీలు
- బాధితులకు భరోసా ఇచ్చిన ఎస్పీ వకుల్‌జిందాల్



ఎస్పీ వకుల్‌జిందాల్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

బాపట్లటౌన్: స్పందనకు అర్జీలు భారీగా వచ్చాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 47 మంది అర్జీలు అందించారు. ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి. మహేష్ బాధితులతో మాట్లాడి అర్జీలు తీసుకున్నారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కిందస్థాయి అధికారులను ఆదేశించారు.

రైల్వే ఉద్యోగాల పేరుతో మోసం

చిలకలూరిపేటకు చెందిన గుంజి శ్రీనివాసరావు, భార్య రమాదేవి, అత్త తన్నీరు నాగరత్తమ్మ రైల్వే ఉద్యోగాల పేరుతో నమ్మించారు. మా నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేశారు. పిల్లలకు ఉద్యోగాలు వస్తాయనే ఉద్దేశంతో డబ్బులు చెల్లించాం. ఉద్యోగాలు రాలేదు. డబ్బులు తిరిగి చెల్లించలేదు. న్యాయం చేయాలి.

-బాధితులు, చెరువుజమ్ములపాలెం

మా కోడలు చంపాలని చూస్తోంది

మేము వృద్ధులం. మా పెద్దకొడుకు మూగవాడు. నా పెద్ద కోడలు నిత్యం మమ్ములను కర్రలతో కొడుతూ చంపాలని చూస్తోంది. నిత్యం నా పేరుతో ఆస్తి రాస్తారా లేదా అంటూ బెదిరిస్తోంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. మా కోడలు బారి నుంచి కాపాడాలి.

-బందారు సుబ్బారావు, రంగమ్మ దంపతులు, అనుమోజిపాలెం, ఇంకొల్లు మండలం

నా స్థలాన్ని కబ్జాచేసి నన్ను చంపాలని చూస్తున్నారు

నేను బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తుంటాను. నాకు చీరాల మండలం, రామానగర్‌లో ఐదు సెంట్ల స్థలం ఉంది. నా స్థలాన్ని ఉసురుమాటి ఏసుదాసు ఆక్రమించుకున్నాడు. దీనిపై నేను చీరాల కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నా. ఈ విషయంపై కోర్టులో నా తరఫున సాక్ష్యం చెప్పిన ఉసురుపాటి ఆదాము అనే వ్యక్తిని స్థలాన్ని ఆక్రమించిన ఉసురుపాటి ఏసుదాసు, అతడి కుమారులు, కోడళ్లు సురేష్, అనిల్, సునంద, మేరి, లాజరు, మేరిదయ, విన్సెంట్, మహేష్, మమత దాడిచేసి చంపేందుకు చూస్తున్నారు.

- ఉసురుపాటి వెంకటేశ్వర్లు, ఈదుమూడి, నాగులుప్పలపాడు మండలం

గ్రామ సచివాలయ ఉద్యోగులు ఖుషీ

- శాశ్వత ఉద్యోగులకు పెరిగిన పే స్కేల్
- తొలి ఇంక్రిమెంట్, డీఏ అందుకున్న ఉద్యోగులు
- జిల్లాలో 4,260 మందికి ప్రయోజనం



వార్డు సచివాలయం

చీరాల: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువ చేయడంతో పాటు స్థానిక యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. గత ఏడాది సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అప్పటి నుంచి పే స్కేల్ ప్రకారం జీతాలు అందిస్తోంది. ప్రభుత్వం తొలి ఇంక్రిమెంట్, డీఏ పెంచింది. పెరిగిన జీతాలు అందుకున్న ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తీపి కబురు ఇలా..

జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. శాశ్వత ఉద్యోగులుగా మారి ఏడాది పూర్తయిన వారికి ఏ మాత్రం జాప్యం లేకుండా ఇంక్రిమెంట్, డీఏ కలిపి జూలై నెల జీతాన్ని ఆగస్టులో అందించింది. తొలి ఇంక్రిమెంట్, డీఏ పెంపుతో జీతం పెరుగుదల కనిపించడంతో సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో ఉద్యోగం చేపట్టిన తర్వాత ప్రొబేషన్ సకాలం పూర్తి చేయడం, శాశ్వత ఉద్యోగులుగా చేయడంతో పాటు ఏడాది పూర్తయిన వెంటనే ఇంక్రిమెంట్, డీఏ పెంచడం సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఉద్యోగులు అంటున్నారు.

ఉద్యోగులకు లబ్ధి..

బాపట్ల జిల్లాలో మొత్తం 477 సచివాలయాలు ఉండగా వీటిలో 4260 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఇంక్రిమెంట్ రూ.600 చెల్లించింది. డీఏను వార్డు సచివాలయ అడ్మిన్, గ్రామ సచివాలయ కార్యదర్శికి రూ.781 చొప్పున పెంచింది. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు రూ.764 చొప్పున డీఏ పెంచారు. ప్రభుత్వం ఇంక్రిమెంట్‌తో పాటు డీఏ పెంచడంతో సచివాలయ ఉద్యోగులకు కేడర్‌ను బట్టి రూ.1503 నుంచి రూ.1546 వరకు జీతాలు పెరిగాయి. వార్డు అడ్మిన్‌కు రూ.1546, వార్డు సెక్రటరీలకు రూ.1530, గ్రామ సచివాలయ సెక్రటరీలకు రూ.1521, గ్రామ సచివాలయ ఉద్యోగులకు రూ.1503 చొప్పున జీతాలు పెరిగాయి.

జీతాలు పెరుగుదల ఇలా...

ఉద్యోగి	పాత స్కేల్	కొత్త స్కేల్
వార్డు అడ్మిన్	రూ.31,648	33,194
గ్రామ సచివాలయ సెక్రటరీ	రూ.30,723	32,244
వార్డు సచివాలయ ఉద్యోగి	రూ.30,749	32,279
గ్రామ సచివాలయ ఉద్యోగి	రూ.29,851	31,354

16 శాతం హెచ్‌ఆర్‌ఏ

జిల్లా కేంద్రానికి 8 కిలో మీటర్లలోపు ఉన్న సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం 16 శాతం మేర హెచ్‌ఆర్‌ఏ అందిస్తోంది. దీంతో జిల్లా కేంద్రానికి సమీపంలో వారికి రూ.950 అదనపు ప్రయోజనం చేకూరుతుంది. మిగిలిన ఉద్యోగులకు 12 శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తిస్తోంది. మొదట్లో సచివాలయ ఉద్యోగులందరికి ఒకే రకమైన హెచ్‌ఆర్‌ఏ వర్తించగా ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నవారికి అదనపు మేలు చేకూరింది.

చాలా సంతోషంగా ఉంది



ప్రొబేషన్ డిక్లర్ చేసి పేస్కేల్ ద్వారా జీతాలు చెల్లించడం, ఏడాది పూర్తి కాగానే ఇంక్రిమెంట్, డీఏతో కలిపి జీతాలు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. అలానే జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల సమీపంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 16శాతం ఇవ్వడం సంతోషంగా ఉంది.

-కోట చందన, వార్డు అడ్మిన్, చీరాల

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సచివాలయ శాశ్వత ఉద్యోగిగా ఏడాది కాలం పూర్తి చేసుకుని మొదటి ఇంక్రిమెంట్, డీఏతో కలిపి జీతం తీసుకోవడం సంతోషంగా ఉంది. సకాలంలోనే మాకు ప్రొబేషన్ పూర్తి చేసి పే స్కేల్ ద్వారా జీతాలు చెల్లించడం వెంటనే ఇంక్రిమెంట్, డీఏతో పాటు జీతాలు చెల్లించి భరోసా కలిగించినందుకు సీఎంకు కృతజ్ఞతలు.

-తోట పూర్ణచంద్రరావు, ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాయుద్ధనౌక గద్దరన్నకు నివాళి

పాత గుంటూరు: బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కోసం ప్రజా యుద్ధ నౌక గద్దరన్న విశేష కృషి చేశారని ప్రముఖ సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గద్దరన్న సంస్మరణ సభ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వి. సి. కె. జాతీయ అధ్యక్షులు, ఎం.పి. డాక్టర్ తిరుమావళవన్, అరుణోదయ విమలక్క, ప్రజా కవి జయరాజ్, ప్రజా కళా మండలి కోటి, టీడీపీ నాయకుడు నక్కా ఆనందబాబు పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ధూమ్ ధామ్ కళా నివాళులర్పించారు. సభకు ప్రముఖ న్యాయవాది వై.కే అధ్యక్షత వహించారు. గద్దర్ పాడిన పాటలను గాయకులు ఆలపించారు. కార్యక్రమంలో ప్రజా గాయకులు పి.వి.రమణ, పల్లె నరసింహ, ఎస్ శరత్, పాటల వెంకన్న, కత్తి లెనిన, భీమాశంకర్, కొల్లూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డిసెంబరులో మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు డిసెంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహిస్తామని మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ లాల్‌వజీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు సంబంధించి తేదీలు, ఇతర వివరాలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలను తీర్మానంలో ఆమోదించామన్నారు. తమ సంఘాన్ని నేషనల్ మాస్టర్స్ అసోసియేషన్‌లోకి తీసుకున్నారని పేర్కొన్నారు. రానున్న కాలంలో మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్‌తో పాటు క్రీడాకారుల భవిష్యత్తుకు కృషి చేస్తామన్నారు.

తొమ్మిది మండలాల్లో వర్షం

కొరిటెపాడు (గుంటూరు): జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు తొమ్మిది మండలాల్లో వర్షపాతం నమోదు కాగా... అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 8.8 మిల్లీమీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తుళ్లూరు మండలంలో 0.4 మి.మీ వర్షం పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు తూర్పు 6, మంగళగిరి 4, తాడేపల్లి 3.4, ప్రత్తిపాడు 2, మి.మీ వర్షపాతం నమోదైంది.

మత్స్యకారుల వలకు చిక్కిన భారీ ఏనుగు టేకు చేప



వలకు చిక్కిన ఏనుగు టేకు చేపను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు



ఒడ్డుకు చేర్చిన 4 క్వింటాళ్ల భారీ ఏనుగు టేకు చేప

చీరాల టౌన్: మత్స్యకారుల వలకు భారీ ఏనుగు టేకు చేప చిక్కింది. వివరాలు.. మండలంలోని వాడరేవుకు చెందిన గంగిరి గోవిందు, ఐదుగురుతో కలసి నాలుగు రోజుల క్రితం సముద్రంలో వేటకు వెళ్లాడు. ఆదివారం రాత్రికి వేట ముగించుకుని తిరిగి తీరానికి వస్తుండగా వలకు భారీగా మత్స్య సంపద చిక్కిందని ఆనంద పడ్డారు. కష్టపడి వలను బయటకు లాగి చూస్తే 9 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో 4 క్వింటాళ్లకుపైగా బరువు ఉన్న ఏనుగు టేకు చేప పడింది. ఐదు రోజులుగా వేట చేస్తున్న తమకు టేకు చేప వలకు చిక్కగా సోమవారం తీరం ఒడ్డున వేలం పాట నిర్వహించగా కేవలం ఈ టేకు చేప రూ.2 వేలు పలకడంతో వేట చేసిన మత్స్యకారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. వేటకు రూ.30 వేలు ఖర్చు కాగా టేకు చేప వలన తమకు ఖర్చులు, కష్టాలు మిగిలాయని మత్స్యకారులు చెప్పారు.

ఐదు రోజుల క్రితం వాడరేవు మత్స్యకారుల వలకు 800 కిలోల బరువు ఉన్న పులి మచ్చల సొర చేప వలకు చిక్కింది. భారీగా మత్స్య సంపద చిక్కిందని ఆనందపడిన మత్స్యకారులకు కష్టం మిగిలింది. కాసులు మాత్రం పడలేదు.

ఓటరు జాబితా ప్రక్రియ పక్కాగా ఉండాలి

- అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



కొల్లూరులో ఓటర్ల జాబితాల సవరణపై సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కొల్లూరు: ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు ఓటర్ల జాబితా సవరణలు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితాలపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిరంతరం యంత్రాంగం పర్యవేక్షిస్తూ, వారికి మార్గదర్శకత్వం వహించాల్సి ఉంటుందని చెప్పారు. బీఎల్‌ఓలు నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు, తొలగింపునకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇంటింటి సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొల్లూరులోని ఓ పోలింగ్ బూత్ పరిధిలో సర్వేలో 206 ఓట్లు తొలగించడానికి ప్రతిపాదించడాన్ని గుర్తించిన ఆయన బీఎల్‌ఓ మల్లికార్జునను వివరణ కోరారు. అద్దెకు ఉండి ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మృతి చెందిన వారు అధికంగా ఉండటంతో తొలగింపులు అనివార్యమైనట్లు బీఎల్‌ఓ కలెక్టరుకు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఓటర్ల తొలగింపులు, డోర్ షిఫ్టింగ్‌ల విషయంలో బీఎల్‌ఓలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఉన్న డోర్ నంబర్‌కు తప్పనిసరిగా రిజిస్ట్రార్ పోస్టు ద్వారా సమాచారం అందజేసి రిజిస్ట్రార్ పోస్టు తిరిగి వచ్చిన పక్షంలో దాన్ని ఆధారంగా చేసుకుని, బీఎల్‌ఓలు విచారణ చేపట్టిన అనంతరం స్థానిక వ్యక్తులతో సాక్షి సంతకాలు సేకరించి ఓట్లను షిఫ్ట్ చేయాలని సూచించారు. కొల్లూరు మండలంలోని 54 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ నూరు శాతం పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ జె.పార్థసారథి, ఏఆర్‌ఓ జె.రామ్మోహనరావు, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

ఓటరు సర్వే పూర్తి

కలెక్టర్ రజిత్ బాషా

చెరుకుపల్లి: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఇంటింటా సర్వే నూరుశాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బీఎల్‌ఓల సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ మాట్లాడుతూ తొలగించిన ఓటరు జాబితాను పరిశీలించారు. ఇంటింటి సర్వే ద్వారా బీఎల్‌ఓలు నిర్వహించిన సర్వేలో ఆయా బూతుల పరిధిలోని గ్రామాల్లో మృతి చెందిన వారు, డబుల్ ఎంట్రీలు, ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిన వారి వివరాలు సక్రమంగా నమోదు చేశారా లేదా ఆరా తీశారు. ఆయన వెంట రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి, తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు, ఆర్ఐ మౌనికా ఉన్నారు.

31న జిల్లా అథ్లెటిక్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 31న స్థానిక బీఆర్ స్టేడియం ఉదయం 9 గంటలకు అండర్-14, 16, 18, 20, 23 బాల బాలికలు, యువతీ యువకుల విభాగంలో జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను వచ్చే నెల 21 నుంచి 23 వరకు ఏలూరులో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

నేడు గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డ్స్ ప్రధానం

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక చంద్రమౌళీ నగర్‌లోని నా. ద్ వెల్‌నెస్ వరల్డ్‌లో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, సహస్ర ఆర్థో అండ్ న్యూరో సెంటర్ సంయుక్తాధ్వర్యంలో క్రీడాపురస్కారాలు అందజేస్తామని నిర్వాహకులు జీవీఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 10 సంవత్సరాలనుంచి ఈ అవార్డులను ప్రధాన చేస్తున్నామ న్నారు. క్రీడలు, శిక్షణ, స్పోర్ట్స్ జర్నలిజంలో ఉత్తమ ప్ర తిభకబరచిన వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మేదరమెట్ల: మోటారు బైకుకు ఓ మలుపు వద్ద అదుపుతప్పి కింద వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి కొరిశపాడు మండలంలోని రాచపూడి సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. ఇంకొల్లు గ్రామానికి చెందిన షేక్ రామ్‌రహీం(39) కొంత కాలంగా ఒంగోలులో నివాసం ఉంటున్నాడు. ఇంకొల్లులో నివసం ఉంటున్న తాత ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆదివారం రాత్రి మోటారు బైకుపై ఒంగోలు నుంచి ఇంకొల్లు బయలు దేరాడు. బైకు రాచపూడి గ్రామ సమీపంలో రోడ్డు మలుపు వద్ద బ్రేక్ వేయడంతో జారి పడి రోడ్డు పక్కన ఉన్న దిమ్మెకు తల తగలడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. గుర్తుతెలియని వ్యక్తి స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

ఇంట్లో బంగారం చోరీ

చీరాల: ఇంట్లో బంగారం చోరీకి గురైన ఘటన ఈపురుపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం.. ఈపూరుపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో నివసిస్తున్న గెల్లి పున్నారావు ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలసి పొన్నూరు వెళ్లారు. అక్కడి నుంచి తన మనుమరాలికి పెళ్లి సంబంధం మాట్లాడేందుకు పిడుగురాళ్ల వెళ్లి రాత్రి పొన్నూరులోనే ఉండిపోయారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండటం గమనించారు. బీరువాలో ఉంచిన 3.50 సవర్ల బంగారం, 75 గ్రాముల వెండి, రూ.5 వేల చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

శేకూరులో రిటైర్డు ఉద్యోగి హత్య

శేకూరు (చేబ్రోలు): మండలం శేకూరు గ్రామంలో అనుమానస్పద స్థితిలో ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో రిటైర్డు ఉద్యోగి హత్యకు గురైన ఘనట సోమవారం రాత్రి వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఉన్నం సుందరరావు (75) స్థానిక దళితవాడలో ఒంటరిగా సొంత భవనంలో నివిస్తున్నాడు. కుటుంబ సభ్యులు సుదూర ప్రాంతాల్లో ఉన్నారు. అయితే తరుచుగా తెనాలి వెళ్లి వస్తుండే సుందరరావు రెండు రోజుల క్రితమే హత్యకు గురైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గొంతు, పొట్టపై కత్తి పొడిచిన గాయాలు ఉన్నట్లు గుర్తించారు. కుటుంబసభ్యులు బంధువులు ఎవరూ లేకపోవటంతో మృతి చెందిన విషయం వెలుగులోకి రావటానికి జాప్యం జరిగినట్లు అనుమానిస్తున్నారు. సుందరరావు హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఇతనికి ఎటువంటి వివాదాలు లేవని తెలుస్తోంది. చేబ్రోలు ఎస్ఐ కే ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం బృందం ఆధారాలను సేకరిస్తోంది.

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



హెనీ క్రిస్టినాకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి, కత్తెర సురేష్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సేవకు ప్రాధాన్యమిస్తూ నగరంలోని వృద్ధాశ్రమాలు, మానసిక వికలాంగుల ఆశ్రయాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పేదలకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి యేసురత్నం, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, విభిన్న ప్రతిభావంతుల సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, జెడ్పీ ఉపాధ్యక్షుడు బత్తుల అనూరాధ, శొంఠిరెడ్డి నర్సిరెడ్డి పాల్గొని హెనీ క్రిస్టినాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయ కర్త కత్తెర సురేష్‌కుమార్‌తో కలిసి హెనీ క్రిస్టినా జన్మదిన కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా జెడ్పీ ప్రాంగణంలో మొక్క నాటారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వై.ఎస్.జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కోన, సిబ్బంది

బాపట్ల అర్బన్: ఆంధ్రప్రదేశ్ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగుల జీతాలు 23 శాతం పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీఓ నెంబర్ 64 విడుదల చేయడం హర్షణీయమని వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలు, సీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ జట్టు ఇదే



పోటీలకు ఎంపికైన జట్లతో జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్‌బాబు, నరేష్

మంగళగిరి: కావలిలో సెప్టెంబరు ఎనిమిదవ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పురుష, మహిళా జట్లను ఎంపిక చేసినట్లు షూటింగ్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కిషోర్‌బాబు, సంయుక్త కార్యదర్శి కె.నరేష్, వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల పీటీ రవిలు సోమవారం తెలిపారు. నగరంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వారు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన పురుష, మహిళల జట్ల వివరాలను వెల్లడించారు. పురుషుల జట్టుకు కె.తేజ, ఎస్‌కే సమీర్, ఎం గోపాల్, బి.నాగేశ్వరరావు, కె.భాను, ఎం శివసాయి, బి.జగదీష్, ఎం.వెంకటసాయి, కె దుర్గా ప్రసాద్, పి.సతీష్, టి.తేజ, జె.నారాయణ, కె.రేవంత్, బి.చిట్టిబాబులు ఎంపికై నట్లు తెలిపారు. మహిళల జట్టుకు వి.తనుశ్రీ, బి. గుణప్రియ, చంద్రిక, దివ్య, పి.శారద, సీహెచ్ కృష్ణకుమారి, పి.నీలిమాదేవి, బి.బెస్సీ, కె.శ్రావణి, టి.త్రివేణి, ఈ.వెంకటలక్ష్మి, బి.జ్యోతి, బి.దేవి, కె రేష్మలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల సెక్రటరీ వి.తాతారావు, ప్రిన్సిపాల్ జి. నాగేశ్వరరావు, డాన్‌బాస్కో స్కూల్ పీడీ కె పాల్‌రాజ్, బి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.